క్లుప్తంగా

శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లులో వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారి ఆలయాన్ని శాస్త్రోక్తంగా శుద్ధి చేసి పూజలు ప్రారంభించారు. అభిషేకం, అర్చనలు అయిన అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆర్య. వైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆర్య వైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో లలితా సహస్ర నామాన్ని పఠించారు.

అమ్మవారి సేవలో ఉండి ఎమ్మెల్యే


ఆలయం వెలుపల రఘురామకృష్ణమరాజు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే రఘురామకృష్ణమరాజు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాదం ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు మీడియాన్ని తప్పనిసరి చేయాలి

తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి 5వ తరగతి వరకు తెలుగు మీడియాన్ని తప్పనిసరి చేయాలని, అలాగే 6నుంచి 10వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్ మీడియాల్లో బోధన చేపట్టాలని ప్రభుత్వాన్ని ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సాంబిరెడ్డి కోరారు. తిరుపతిలోని ఆపస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని, అలాంటి పాఠశాలలు బలోపేతం కావడానికి ప్రభుత్వ బడిలో చదివే విద్యార్థుల తల్లులకు మాత్రమే అమ్మ ఒడి పథకం వర్తించేలా నిబంధనలను సవరించాలని కోరారు. అలాగే ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించేలా చర్యలు తీసుకోవాలని, 117 జీఓను రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆపస్ జిల్లా సహాధ్యక్షులు దేవరాజులు, నాయకులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ ట్రస్టు అన్నదానం


అన్నదానం చేస్తున్న డాక్టర్ పీసీ రాయులు

తిరుపతి కల్చరల్: పద్మభూషణ్ డాక్టర్ కుమార మంగళం బిర్లాజీ 57వ జన్మదినాన్ని పురస్కరించుకొని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీరాయులు ఆధ్వర్యంలో గాంధీ రోడ్డులోని ట్రస్ట్ కార్యాలయం వద్ద పేదలకు అన్నదానం చేశారు. అంతకుముందు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీరాయులు మాట్లాడుతూ 37 దేశాలలో సుమారు లక్షా 80 వేల మంది ఉద్యోగులు వివిధ బిర్లా సంస్థల్లో పని చేస్తున్నారని తెలిపారు. వారి పూర్వీకులు కూడా దేశ సేవ చేశారని గుర్తు చేశారు. కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ ప్రతినిధులు బండి మధుసూదన్‌రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, డాక్టర్ పి.రెడ్డెప్ప, గాదే సుబ్రమణ్యంరెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

ఎమ్మెల్యే శ్రీనివాసులుకు సన్మానం


ఎమ్మెల్యేను అభినందిస్తున్న వైద్యాధికారులు

తిరుపతి తుడా: తిరుపతి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆరణి శ్రీనివాసులును జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి ఆధ్వర్యంలో ఇతర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యులు , వైద్య సిబ్బంది ఆయనను సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

తెలుసుకో.. జాగ్రత్తగా మసలుకో..!

గ్యాస్ సిలిండర్‌లు వినియోగించే ముందు వాటిని పూర్తి స్థాయిలో పరిశీలించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆయిల్ కంపెనీలు సిలిండర్‌లను పూర్తి స్థాయిలో పరిశీలించిన అనంతరం గ్యాస్ నింపి వినియోగదారులకు సరఫరా చేస్తాయి. అయితే వీటికి కాలపరిమితి ఉంటుంది. సిలిండర్ సరఫరా చేసిన ప్రతి పర్యాయం వినియోగదారులు వాటి గడువు తేదీని పరిశీలించాలి. కాలపరిమితి ముగిసిన సిలిండర్ వినియోగిస్తే లీకేజీలతో ప్రమాదాలు పొంచి ఉంటాయి

- గడువు దాటితే ముప్పు తప్పదు
- వంట గ్యాస్ సిలిండర్‌కు కాలపరిమితి
- గడువు తేదీని పరిశీలించి తీసుకోవాలి
- గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి



తిరుపతి తుడా : గ్యాస్ సిలిండర్‌తో వంట చేసుకోవడం ఎంత సులభమైన పద్ధతో.. సరైన జాగ్రత్తలు పాటించకపోతే అంతే ప్రమాదం కూడా ఉంటుంది. సిలిండర్‌కు కాలపరిమితి ఉంటుందని, దాన్ని వినియోగదారులు గుర్తించాలని నిపుణులు చెబుతున్నారు. గడువు తేదీ ముగిసిన సిలిండర్‌ను వినియోగిస్తే గ్యాస్ లీక్ అయ్యే ప్రమాదం ఉంది. వంట గ్యాస్ కంపెనీలు సరఫరా చేసే ప్రతి సిలిండర్‌పై గడువు తేదీ, కోడ్



విధానంలో మెటల్ ప్లేటుపై ముద్రిస్తాయి. సిలిండర్‌ను మార్చుకున్నప్పుడల్లా ఆ గడువు తేదీని చూసుకుని వినియోగించుకోవాలి.

ఇలా గుర్తించాలి..

సిలిండర్ మెటల్ ప్లేటుపై ఏ–24, బి–24 అని ఉంటే ఆ సిలిండర్ 2024 మార్చి– జూన్‌కి గడువు ముగుస్తుందని అర్థం. 24 అంటే 2024 సంవత్సరానికి, ఆంగ్ల అక్షరం త్రైమాసికానికి సూచిక. 'ఏ' అక్షరం జనవరి నుంచి మార్చి వరకు, 'బీ' అక్షరం ఏప్రిల్ నుంచి జూన్ వరకు, 'సీ' అక్షరం జూలై నుంచి సెప్టెంబర్ వరకు, 'డి' అక్షరం అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు అని గుర్తించాల్సి ఉంటుంది.

ఎట్టిపరిస్థితుల్లో తీసుకోవద్దు..

సిలిండర్ ఇంటి వద్దకు వచ్చిన వెంటనే మెటల్ ప్లేటుపై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీని పరిశీలించాలి. గడువు తేదీ నెల వ్యవధిలో ముగుస్తున్నట్లు సిలిండర్‌పై ఉంటే దాన్ని తీసుకోకూడదు. ఎందుకంటే చిన్న కుటుంబాల వారికి నెల రోజులకు పైగా గ్యాస్ వస్తుంది. ఆ సిలిండర్ స్థానంలో వేరే సిలిండర్‌ను అడిగి తీసుకునే హక్కు వినియోగదారుడికి ఉంది.

సిలిండర్‌కు పదేళ్ల గడువు..

సిలిండర్ తయారైనప్పటి నుంచి పదేళ్ల వరకు గడువు ఉంటుంది. సిలిండర్‌ను ప్రత్యేకమైన ఉక్కుతో.. సిలిండర్ లోపల సురక్షితమైన కోటింగ్‌తో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ప్రమాణాల మేరకు తయారు చేస్తారు. బీఐఎస్ అనుమతులు తీసుకున్న తర్వాతే సిలిండర్ మార్కెట్‌లోకి వస్తుంది.

వినియోగదారుని హక్కులు..

- వినియోగదారుడు మృతి చెందితే వారి కుటుంబసభ్యుల పేరిట ఆ కనెక్షన్‌ను మార్పు చేసుకోవచ్చు.
- కొత్త కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే నిబంధనల మేరకు ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే అదే రోజు కనెక్షన్ పొందవచ్చు.
- కొత్త కనెక్షన్ తీసుకునే సమయంలో తమ వద్దనే స్టౌ కొనుగోలు చేయాలని డీలర్ కోరవచ్చు. డీలర్ వద్దనే కొనుగోలు చేయాలనే నిబంధన ఏమీ లేదు.
- గ్యాస్ ఏజెన్సీ నుంచి 5 కిలోమీటర్లు పరిధిలోని వినియోగదారులకు సిలిండర్ ఉచితంగా డోర్ డెలివరీ చేయాలి.

రక్తదానానికి యువత ముందుకు రావాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, చిత్రంలో డీఎంహెచ్‌ఓ శ్రీహరి, ఎంహెచ్‌ఓ యువ అన్వేష్

తిరుపతి తుడ : రక్తదానంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడవచ్చని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఓ ప్రైవేటు హోటల్లో రక్తదాన శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్త దానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. అపోహలను వీడి ఆరోగ్యవంతులైన యువకులంతా రక్తదానం ఇచ్చేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేసిన వారికి ఆరోగ్యం పరంగా బహుళ ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ ఒక వ్యక్తి రక్త దానం చేస్తే ఆ రక్తంతో ముగ్గురి ప్రాణాలను నిలబెట్టవచ్చని తెలిపారు. ఒక వ్యక్తి 4–6 లీటర్ల రక్తాన్ని సురక్షితంగా దానం చేయవచ్చని చెప్పారు. తిరిగి 90 రోజుల్లో ఆ వ్యక్తులకు రక్త ఉత్పత్తి ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. 17 –65 సంవత్సరాల మధ్య ఉన్న ఆరోగ్యవంతులు రక్తదానం చేసేందుకు అర్హులని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యు.అన్వేష్, ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్, రుయా, మెటర్నటీ సూపరింటెండెంట్లు డాక్టర్ రవి ప్రభు, డాక్టర్ పార్థసారథిరెడ్డి, వైద్యాధికారులు శ్రీనివాసులు రెడ్డి, శ్రీనివాసులు, మాస్ మీడియా అధికారి బాబు నెహ్రూ రెడ్డి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలలో భక్తుల రక్తదానం

తిరుమల: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం తిరుమల అశ్విని ఆస్పత్రిలో భక్తులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మొత్తం 14 మంది భక్తులు శిబిరంలో రక్తదానం చేశారు. వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సివిల్ సర్జెన్ డాక్టర్ కుసుమ కుమారి, డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ సుబ్బారెడ్డి, హెడ్ నర్స్ సావిత్రి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


తిరుమల అశ్విని ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న భక్తులు

ఆలయం ముందు గుంట



తిరుపతి తుడా: తిరుపతి భవానీనగర్ ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా భారీ గుంతతో నిత్యం వాహనదారులు అవస్థలు పడుతున్నారు. 2నెలలుగా ఇక్కడ గుంత ఉంది. మున్సిపల్, టీటీడీ అధికారులు ఈ రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోవడం లేదు. ప్రధానంగా ఈ ప్రాంతంలో అనేక ఆస్పత్రులు ఉన్నాయి. అంబులెన్స్‌లు రావాలన్నా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు నిత్యం ప్రమాదాలబారిన పడుతున్నారు. వర్షం వస్తే గుంతలో నీరు నిలిస్తోంది. పెద్ద వాహనాలు వెళ్లే సమయంలో పాదచారులు, ద్విచక్ర వాహనదారులపై నీరు చిమ్ముతోంది. ఇకనైనా అధికారులు స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు.

సాయి సుధాలో ఉచిత రెటీనా పరీక్షలు


రెటీనా పరీక్షను నిర్వహిస్తున్న డాక్టర్ సుధారాణి

తిరుపతి తుడా : నగరంలోని రెడ్డి అండ్ రెడ్డి కాలనీ ఉన్న శ్రీసాయి సుధా కంటి ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన ఉచిత రెటీనా కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఆస్పత్రి అధినేత్రి డాక్టర్ సుధారాణి రోగులకు రెటీనా పరీక్షలను నిర్వహించారు. ఉచితంగా కంటి మందులను పంపిణీ చేశారు. కళ్లకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె అవగాహన కల్పించారు.

వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం


వైఎస్సార్ విగ్రహం వద్ద అపరంజిరాజు, నాయకులు

నాగలాపురం: మండల కేంద్రంలోని టవర్ కాక్ కూడలి వద్ద దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో భాగంగా విగ్రహానికి ముసుగు వేశారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఎత్తి వేసిన నేపథ్యంలో విగ్రహానికి ఉన్న ముసుగును తీసివేసి పాలాభిషేకం చేసి, పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ చిన్నదొరై సుధా, ఉప సర్పంచ్ సునీత, నాయకులు శ్యామ్, ఉదయ్, దేశప్పన్, చిరంజీవి, ధనరాజ్, దేశన్, హరిబాబు, అమర తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయండి


అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌కు సూచనలు ఇస్తున్న ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి

రామచంద్రాపురం: అధికారులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు వారి శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల అధికారులు పంచాయతీల్లో పర్యవేక్షించి, సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా సత్వర చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇంటి పన్నులు సకాలంలో చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణులకు, చిన్నారులకు అంగన్‌వాడీలు పౌష్టికాహారం అందేలా చూడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రత్యూష, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌దే ప్రధాన పాత్ర


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు, అధ్యాపకులు

తిరుపతి సిటీ: సాంకేతిక పురోగతిలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌దే ప్రధాన పాత్ర అని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమాశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం ఎస్వీయూ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సెమినార్ హాల్‌లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ అండ్ రీసెర్చ్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె ప్రసంగిస్తూ ఆధునిక కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ శరవేగంగా దూసుకుపోతు న్నాయని తెలిపారు. ఇవి సమాచారం, నిర్వహణ, విశ్లేషణ, ఆకర్షణీయత పెంచడంలో ప్రధాన భూమికలు పోషిస్తాయన్నారు. కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు సమాజ అవసరాలకు అనుగుణంగా వీటిపై దృష్టి సారించాలన్నారు. వీటికి సంబంధించిన ట్రెండ్స్ అండ్ టెక్నాలజీపై ఆమె సుదీర్ఘ ప్రసంగం చేశారు. అనంతరం ముఖ్యఅతిథులు సావనీర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పీవీ. నరసయ్య, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ ఎం పద్మావతమ్మ, సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎం.శ్రీదేవి, కంప్యూటర్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ జి.అంజాన్ బాబు, ప్రొఫెసర్ కె.విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

నయనానందకరంగా ఊంజల్ సేవ


ఊంజల్ సేవలో శ్రీపద్మావతీ అమ్మవారు

నారాయణవనం: టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీపద్మావతీ అమ్మవారు ఉయ్యాల సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కైంకర్యాలను నిర్వహించారు. ఉదయం 7 గంటలకు శ్రీవేంకటేశ్వరస్వామికి, 8 గంటలకు శ్రీపద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలను పూర్తి చేశారు. సాయంత్రం నిత్యకైంకర్యాల అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలి కలు, విశేష ఆభరణాలతో అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేసి పూజలు చేశారు. తదుపరి అంతర ప్రాకారంలో ఊరేగింపుగా తీసుకువెళ్లి ఊంజల్ మండపంలోని ఊయలపై కొలువుదీర్చారు. వేద నాద కచేరీల నడుమ అమ్మవారు ఊయలలో సేద తీరుతూ భక్తులను అనుగ్రహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్లాస్టిక్ కవర్లను నిషేధిద్దాం


వస్త్ర సంచులను పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

శ్రీకాళహస్తి: ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని ఆపి, వస్త్ర సంచులను వినియోగిద్దామని మార్గదర్శి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పిలుపునిచ్చారు. శుక్రవారం మార్కెట్ యార్డులో సంతలో ప్రజలకు సంస్థ తరఫున వస్త్ర సంచులను పంపిణీ చేశారు. వస్త్ర సంచుల వినియోగం, ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అవగాహన కల్పించారు. ఇకపై ప్రతి శుక్రవారం వస్త సంచులను పంపిణీ చేసి ప్లాస్టిక్ సంచుల నిషేధంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రుద్రశేఖర్ రెడ్డి, కృష్ణయ్య, అక్బర్, పాండు, దిలీప్, సాయి తదితురులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం


అవగాహన కల్పిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: పట్టణంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై కార్మికశాఖ అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. వస్త్రదుకాణాల, బేకరీలు, హోటల్స్, జనరల్ స్టోర్స్ వంటి వాటిలో తనిఖీలు నిర్వహించి అవగాహన కల్పించారు. బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని తెలిపారు. ఈకార్యక్రమంలో కార్మికశాఖ అధికారులు రంగనాథ్, శ్రీమన్నారాయణ, హేమాచారి తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో రాహుకాల అభిషేక పూజలు



ప్రత్యేక పూజలందుకున్న గంగమ్మ, విశేష అలంకరణలో విరూపాక్షి మారెమ్మ

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిప్రపత్తులతో రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేశారు. రాహుకాల సమయం 10.30 నుంచి 12 గంటల మధ్య సాంప్రదాయరీతిలో అర్చనలు, అభిషేక పూజార్చన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం అమ్మవారిని బంగారు నగలు, పలు రకాల పుష్పాలతో అందంగా ముస్తాబు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

మారెమ్మ ఆలయంలో..

పుంగనూరు: పట్టణంలో బస్టాండులోని శ్రీవిరూపాక్షి మారెమ్మకు శుక్రవారం మధ్యాహ్నం రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారిని పసుపు, కుంకుమ, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.. మహిళలు చలిపిండి దీపాలు వెలిగించి, పొంగలి, పెరుగు అన్నం నైవేద్యంగా సమర్పించి, మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పంటలపై ఏనుగుల దాడి

పెద్దపంజాణి: మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కొంత కాలంగా పెద్దకాప్పల్లె పంచాయతీలోని అటవీ సరిహద్దు గ్రామాలలో సాగు చేసిన పంటలను నాశనం చేస్తున్నాయి. గురువారం రాత్రి పుంగనూరు రేంజ్ పేటూ రు బీటు నుంచి వచ్చిన ఏనుగులు పెనుగొలకల పొలాలపై విధ్వంసం సృష్టించాయి. శుక్రవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటలు చూసి కన్నీటి పర్యంతమయ్యారు. దాడుల్లో టమాట, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. బాధిత రైతులు చిన్నబ్బ, పిచ్చమ్మ తాము రూ 20 వేల పంట నష్టపోయినట్లు చెప్పారు. గజదాడులకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నా అటవీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని రైతులు వాపోయారు. ఏనుగుల దాడిలో దెబ్బతిన్న పంటలను రాయలపేట ఫారెస్టు బీట్ ఆఫీసర్ రవికుమార్ పరిశీలించారు. పరిహారం మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గంగమ్మతల్లికి మొక్కుల చెల్లింపు

తిరుపతి కల్చరల్: నరేంద్రమోదీ దేశ ప్రధానిగా మూడవ సారి ప్రమాణస్వీకారం చేసి హాట్రిక్ సాధించడంతో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రారెడ్డి, జిల్లా సాంస్కృతిక శాఖ కన్వీనర్ గుండాల గోపినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీతాతయ్యగుంట గంగమ్మకు పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. తొలిత అమ్మవారికి కొబ్బరి కాయలు సమర్పించి అనంతరం వేయికళ్ల దుత్తలతో ప్రదక్షిణ చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ సుందరమూర్తి, డాక్టర్ భాస్కర్‌రావు, బీజేపీ నేతలు మురళి, సుబ్రమణ్యం రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సవిత, సుబ్రమణ్యం యాదవ్. శంకర్ యాదవ్, జయంతి కుమార్, కవిత, లావణ్య, సుధాకర్, హరికృష్ణ యాదవ్, దీపక్ యాదవ్, హనుమంతరావు, శాంబోలు హరినాథ్ పాల్గొన్నారు.


ప్రసాదాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు